# యథేచ్ఛగా రేషన్ బియ్యం తమిళనాడుకు!




పాలసముద్రం, డిసెంబర్ 6 ప్రభాతవార్త: పాలసముద్రం మండలంలో నిరుపేదలకు అందాల్సిన రేషన్ బియ్యం యధేచ్ఛగా తమిళనాడు రాష్ట్రానికి అక్రమార్కులు తరలించి అధిక ఆదాయం ఆర్జిస్తున్నారు. పాలసముద్రం మండలంలో రేషన్‌కార్డు దారులకు అందాల్సిన బియ్యంను కొంతమంది అక్రమార్కులు తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలకు తరలిస్తున్నారు. కార్డుదారులు రేషన్ షాపుల్లో బియ్యం కొనుగోలు అనంతరం వారి నుండి కొంతమంది అక్రమార్కులు కొంత మొత్తం అధికంగా చెల్లించి రేషన్ బియ్యంను కొనుగోలు చేసి నిల్వ పెట్టుకుంటున్నారు. మరికొంతమంది అక్రమార్కులు నేరుగా రేషన్ డీలర్లతోనే సంబంధాలు పెట్టుకుని వారి నుండి రేషన్ బియ్యంను కొనుగోలు చేసి అక్రమంగా తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలకు తరలించి అధిక లాభాలను ఆర్జిస్తున్నారు. పాలసముద్రం మండలం తమిళనాడు రాష్ట్రానికి సరిహద్దులో వుండటంతో ఇక్కడి నుండి బియ్యం తరలించాలంటే ఒక చిన్న ఆటో వుంటే సరిపోతుంది. ఆటోలో ఒకటి రెండు రేషన్ బియ్యం బస్తాలను వేసుకుని వెళ్ళినా ఎలాంటి ఇబ్బంది వుండదు కాబట్టి ఈ విషయంగా అక్రమార్కులు మండలం నుండి రేషన్ బియ్యంను కొద్ది మొత్తంతో ముందుగా తమిళనాడుకు తరలించి అక్కడే నిల్వ వుంచి అక్కడి వ్యాపారులకు ఎక్కువ మొత్తంలో అమ్మి లాభాలు ఆర్జిస్తున్నారు. గ్రామాల్లో రేషన్ బియ్యం కొనుగోలు చేయడానికి కొంతమంది వ్యాపారులు ఆటోలు, మినీ వ్యాన్లను తీసుకువస్తుండటంతో ఇది ఇక్కడ సర్వసాధారణం అనే విధంగా తయారైంది. ఈ విషయం అధికారులకు తెలిసిన చూసి చూడనట్లు వ్యవహరిస్తుండటంతో అక్రమార్కులు డైరెక్టుగా గ్రామాల్లోకి వాహనాలు తీసుకువచ్చి రేషన్ డీలర్లు, కార్డుదారుల నుండి బియ్యం కొనుగోలు చేసి తరలించే వరకు వచ్చింది. ఇకనైనా అధికారులు రేషన్ బియ్యం అక్రమ రవాణాను కట్టడి చేయడానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

### పుష్కరిణిలో అంగరంగ వైభవంగా...

# అమ్మవారి చక్రస్నానం

**- కనులవిందుగా స్నపన తిరుమంజనం**
**- ధ్వజావరోహణంతో ముగిసిన అమ్మవారి బ్రహ్మోత్సవాలు**



పుష్కరిణిలో అమ్మవారి చక్రస్నానం దృశ్యం

తిరుచానూరు, డిసెంబర్ 6 ప్రభాతవార్త : శ్రీవారి చక్రంస్నానం ఘడియలు కోసం వేచివున్న భక్తులు ఆ అమృత ఘడియలు రాగానే ఒక్కసారిగా గోవింద నామాలతో అమ్మవారి భక్తులు తన్మయత్నానికి గురి అయినారు. తిరుచానూరు కార్తీక బ్రహ్మోత్సవాలలో చివరి రోజు శుక్రవారం ప్రధానమైన పంచమీ తీర్థం వేలాది భక్తుల శ్రీ వారు, అమ్మవారి నామస్మరణల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రభాతంతో అమ్మవారిని మేలుకొలిపి సహస్రనామార్చన, నిత్యార్చన నిర్వహించారు. అనంతరం పల్లకిపై పద్మావతి అమ్మవారు తిరువీధులలో విహరించి భక్తులను అనుగ్రహించారు. అనంతరం పంచమీ మండపంకు ఉత్సవర్లను, చక్రతాల్వార్‌లను వేంచేంపు చేసి వివిధ సుగంధ పరిమిలాలతో కనుల పండుగగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. తరువాత వేలాది భక్తులు వేచి వున్న అమృత ఘడియలలో సమీపించడంతో ఆలయ అర్చకులు వేద పండితులు మంత్రోత్సరణలు, భక్తుల నామస్మరణల నడుమ చక్రతాల్వారులను పద్మావతి పుష్కరిణిలో స్నానమాచరించారు. అనంతరం పుణ్య తీర్థంలో వేలాది భక్తులు స్నానమాచరించి తన్మయత్నంలో మునిగితేలారు. తరువాత సాయంత్రం బంగారు తిరిచ్చిపై అమ్మవారు తిరువీధులలో భక్తులను అనుగ్రహించారు. అనంతరం ధ్వజ అవరోహన కార్యక్రమంతో అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు ముగిసింది. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్ద జీయ్యర్ స్వామి, చిన్న జీయ్యర్ స్వామి, టీటీడీ ఛైర్మన్ బి.ఆర్.నాయుడు, ఈవో జె.శ్యామలరావు దంపతులు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, చంద్రగిరి ఎంఎల్ఏ పులి వర్తి నాని, బోర్డు సభ్యులు, జేఈఓ వీరబ్రహ్మం, గౌతమి, సివిఎస్‌వో శ్రీధర్, ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏవిఎస్వో సతీష్ కుమార్, ఏఈఓ దేవరాజులు, ఆలయ అర్చకులు బాబు స్వామి, సూపరింటెండెంట్ రమేష్, శ్రీవాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్లు చలపతి, సుభాష్, ప్రసాద్ ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## దేవేరికి పసుపు కుంకుమల సారె

**-తిరుమల నుండి భక్తితో కాలినడకన**



తిరుమల, డిసెంబర్ 6 ప్రభాతవార్తప్రతినిధి: తిరుచానూరులో కొలువైన పద్మావతి అమ్మవారి పంచమీతీర్థానికి శుక్రవారం ఉదయం తిరుమల నుండి సాంప్రదాయంగా సారేను ఊరేగింపుగా తీసుకెళ్ళారు. శుక్రవారం వేకువ జామున 4గంటలకు ఆలయం నుండి అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, ప్రసాదాలు, తులసి, వస్త్రాలు, ఆభరణాలతో కూడిన సారేను టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు దంపతులు, టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి దంపతులు తలపై పెట్టుకుని భక్తితో కాలినడకన తిరుమల నుండి బయలుదేరారు. ఆలయ వర్గాలు, మంగళ వాయిద్యాల నడుమ అలిపిరి మెట్లమార్గంలో తిరుపతికి వెళ్ళారు.

## 35వేలమంది భక్తులకు అన్నదానం

**- తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి చే ప్రతి సంవత్సరం**





తిరుచానూరు, డిసెంబర్ 6 ప్రభాతవార్త : తిరుచానూరు పంచమీ తీర్థం సందర్భంగా ఆ గ్రామ సర్పంచ్ రామచంద్రారెడ్డి సుమారు 35 వేల మంది అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా చంద్రగిరి మాజీ ఎమ్.ఎల్.ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు అన్న ప్రసాదం పంచిపెట్టారు. తిరుచానూరు సర్పంచ్ మాట్లాడుతూ గత పదకొండు సంవత్సరాల నుండి అమ్మవారి భక్తులకు అన్న ప్రసాదం పంచడం ఆనవాయతి అని తెలిపారు. గ్రామ ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ఆ పద్మావతి దేవిని ప్రార్థిస్తూ ఈ మంచి కార్యక్రమాన్ని చేపడు తున్నట్లు వివరించారు. ఈ గొప్ప కార్యక్రమానికి సహకరించిన తన మిత్రులకు, అనుచరులకు, అభిమానులను కృతజ్ఞతలు తెలుపుతూ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట యార్డు ఛైర్మన్ శ్రీధర్ రెడ్డి, ఎంపిటిసిలు నరేష్‌రెడ్డి, యోగానందరెడ్డి, శేఖర్, ముండ్లపూడి సర్పంచ్ సురేష్‌రెడ్డి, వార్డు సభ్యులు మునీంద్ర, చంద్ర, చంద్రశేఖర్ ఆజాద్, లోకేష్, మల్లికార్జున, ఆర్‌ఆర్ యూత్ సభ్యులు, వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

### కాణిపాకం దేవస్థానం ఇఓగా...

## పెంచల కిషోర్ బాధ్యతలు స్వీకరణ





ఇఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న పెంచల కిషోర్

కాణిపాకం, డిసెంబర్ 6 ప్రభాతవార్త: సత్యప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీ స్వయంభూ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం కార్యనిర్వహణ అధికారిగా పెంచల కిషోర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. దేవస్థానం రెగ్యులర్ ఇఓగా వున్న ఎ.వెంకటేష్‌ను ఆగస్టు 12న ప్రభుత్వం బదిలీ చేయడంతో ఆలయ డిప్యూటీ ఇఓగా విధులు నిర్వహిస్తున్న వాణి ఇన్‌ఛార్జీ ఇఓగా బాధ్యతలు చేపట్టారు. అయితే కర్నూలు దేవాదాయశాఖ డిప్యూటీ కమీషనర్ గురుప్రసాద్‌ను ఇన్‌ఛార్జీ ఇఓగా నియమిం చడంతో గత ఆగస్టు 31వ తేదీ నుండి ఇఓగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ శాఖ జెఎడిలో పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న డిప్యూటీ కలెక్టర్ పెంచల కిషోర్‌ను ప్రభుత్వం కాణిపాకం దేవస్థానం ఇఓగా నియమిస్తూ గత నాలుగైదు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన శుక్రవారం కాణిపాకం చేరుకుని ఇఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆలయ అధికారులు, అర్చకులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు గణేస్‌గురుకుల్, స్థానాచార్యులు ఫణిస్వామి ఆధ్వర్యంలో వేదాశీర్వచనం చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలను ఇఓ పెంచల కిషోర్‌కు అందజేశారు.

**గణనాధుని సేవలో నూతన ఇఓ:**

ఇఓగా బాధ్యతలు చేపట్టడా నికి కాణిపాకం చేరుకున్న ఆలయ ఎఇఓ రవీంద్రబాబు, అర్చకులు రాజగోపురం వద్ద ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆయనకు వేద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేయగా ఎఇఓ రవీంద్రబాబు స్వామి వారి చిత్ర పటాలు, ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఇఓ కార్యాలయం చేరుకుని బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

**ఆలయ సర్వతోముఖాభివృద్ధికి కృషి:**

కాణిపాకం ఆలయ సర్వతోముఖాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని నూతన ఇఓగా బాధ్యతలు స్వీకరించిన పెంచల కిషోర్ అన్నారు. బాధ్యతలు స్వీకరిం చిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకంగా ఆలయ ఇఓగా నియమించిన సిఎం చంద్రబాబునాయుడు, దేవాదాయశాఖ మంత్రికి, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ఉభయదారులు, గ్రామ స్తుల సహకారంతో భక్తులకు కావాల్సిన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామ న్నారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్, మంత్రి సహకారంతో ఆలయ అభివృద్ధికి నిధులు తీసుకువచ్చి పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

## 8న చాటింపు... 11,12న జాతర సంబరాలు

**కొత్త కమిటీల సారధ్యంలో ఏర్పాట్లు- రోడ్లపై వెలుస్తున్న పందిళ్ళు**



ఏడుగంగమ్మల అమ్మవారు మూలవిరాట్టు

శ్రీకాళహస్తి, డిసెంబర్ 6 ప్రభాతవార్త : తుఫాన్ల గండం గడించింది. ఎముకలు కొరికే చలి జనాన్ని అతలాకుతలం చేస్తుంది, అయితే పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తిలో నిర్వహించే ఏడు గంగమ్మల జాతరకు నిర్వాహకులు సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది కొత్త ప్రభుత్వం కత్త అధికారులు, కొత్త పాలకులు కొత్త జాతర కమిటీలను నామినేట్ చేసుకొని జాతర నిర్వాహణకు సిద్ధమౌతున్నారు. గతం కన్నా ఈ ఏడాది భిన్నంగా నిర్వహించుటకు కమిటీలు, గంగమ్మల స్థావరాల వద్ద పందిళ్ళ ఏర్పాట్లు తలమునకలై ఉన్నారు. ఇప్పటికే నాలుగు మాడా వీధులు, ముత్యాలమ్మగుడి వీధుల్లోవిద్యుత్ తోరణాలు ముస్తాబు చేసారు. ఆదివారం రాత్రి చాటంపుతో జాతరకు శ్రీకారం చుట్టారు.

**మంచుకాలం జాతర:**

చలి కాలం పుణ్యక్షేత్రంలో నిర్వహించే ఏడు గంగమ్మల జాతరకు యుద్ధ ప్రాతిపదికపై సన్నాహాలు జరుగుతున్నాయి. ఆధ్యాత్మిక క్షేత్రంగా దక్షిణ కైలాసంగా భాసిల్లుతున్న శ్రీకాళహస్తి పట్టణంలో నిర్వహించే ఏడుగంగమ్మల జాతర అత్యంత ప్రసిద్ది చెందింది. ఎక్కడైనా జాతరలు వేసవికాలంలో నిర్వహించడం ఆనవాయితీ. అయితే శ్రీకాళహస్తిలో ఏడుగంగమ్మల జాతరకు శీతాకాలంలో డిసెంబర్ మొదటి, లేదా రెండోవారంలో నిర్వహించడం ప్రత్యేకత. అంతేకాక జాతర అంటే మూలస్థానంలో అమ్మవారిని కొలువుదీర్చి పూజలు నిర్వహించి సంబరాలు నిర్వహించుకోవడం జరుగుతుంది. అయితే గంగాజటాధరుడు కొలువుదీరిన దక్షిణకైలాసంలో గంగమ్మతల్లి ఏడు రూపాలుగా భక్తులకు దర్శనమిస్తూ ఏడు ప్రాంతాల్లో కొలువుదీరి భక్తజన కొంగుబంగారంగా భాసిల్లుతూ కోరిన కోర్కెలుతీర్చే అమ్మవారిగా విశ్వరూపిణిగా దర్శనమివ్వడం ఏడు గంగమ్మల జాతరకు ఆయా జాతర కమిటీలు ఏర్పడి పోటాపోటీగా గంగమ్మలను అలంకరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఏర్పాట్లతో శ్రీకాళహస్తి పట్టణంలో జాతర సంబరాలు నెలకొన్నాయి.

## రాష్ట్రాన్ని భ్రష్టు ప్రకటించిన వైసిపి

**- రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**



మండల పరిషత్ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

వెంకటగిరి, డిసెంబర్ 6 ప్రభాతవార్త : గత వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని కోటి 60 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన మండల పరిషత్ కార్యాలయ భవనాన్ని ఎమ్మెల్యే రామకృష్ణతో కలిసి ఆయన ప్రారంభించారు. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తర్వాత పడుకొని ఉన్న అభివృద్ధిని మరల లేపి చేపడుతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం కోట్లాది రూపాయల అప్పుచేసిందని తీర్చి మరల అభివృద్ధిపై దృష్టి పెడుతున్నట్టు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం చంద్రబాబు నాయుడు కేంద్రం నుంచి నిధులు చేస్తున్నట్లు తెలిపారు. చేస్తున్నట్లు తెలిపారు సీఎం చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో రాష్ట్రంలో విరివిగా అభివృద్ధి పనులు చేపడుతామని తెలిపారు. అభివృద్ధి పనుల కోసం అందరూ కలిసి పనిచేయాలని ఆయన కోరారు. వెంకటగిరిలో తాను అనేక అభివృద్ధి పనులు చేశానని చెప్పారు. ఫుట్బాల్ ఆడుతానని అన్న వ్యక్తి ఆ బాలు కనబడకుండా పోయిందని మేదరమల్లి రామ్ కుమార్‌రెడ్డిపై మంత్రి పరోక్షంగా విమర్శలు చేశారు. కనబడకుండా పోయిన ఫుట్బాల్‌ని అందరూ వెతుకుతు న్నారని హేళన చేశారు. తాను ఎమ్మెల్యేగా ఉండగా నియోజకవర్గంలో విరివిగా అభివృద్ధి పనులు చేశానని తెలిపారు . రాష్ట్రంలో అధ్వానంగా ఉన్న రోడ్లను బాగు చేస్తామని తెలిపారు. ఆత్మకూర్ తో పాటు వెంకటగిరి కూడా ఎమ్మెల్యే రామకృష్ణతో కలిసి అభివృద్ధి చేస్తానని తెలిపారు . కూలే స్థితిలో ఉన్న మండల పరిషత్ కార్యాలయం స్థానంలో కొత్తది నిర్మించినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని రాపూర్ బాలాయపల్లి మండలాల్లో కూడా తాసిల్దార్ కార్యాలయాలు ఎంపీడీవో కార్యాలయం నిర్మిస్తున్నట్లు తెలిపారు. వీటన్నిటిని తానే మంజూరు చేసినట్లు చెప్పారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ పట్టణంలో రెండు పార్కులను ఏర్పాటు చేయించాలని తెలిపారు. మంత్రి ఆనం సహకారంతో నీకు వర్గంలో విడిగా అభివృద్ధి పనులు చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి జరగలేదని ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సాల్, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఎంపీపీ సౌజన్యరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ భానుప్రియ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు మండల టిడిపి అధ్యక్షులు చంద్రమౌళిరెడ్డి, ఎంపీడీవో కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యలు పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

**- జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరులు**



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్

వడమాలపేట, డిసెంబరు 6 ప్రభాతవార్త: భూములకు సంబంధించిన ఎలాంటి సమస్యలైన పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేశారని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరులు తెలిపారు. రెవెన్యూ సదస్సులో భాగంగా తొలి రోజు శుక్రవారం వడమాలపేట మండలంలోని కల్లూరులో ఆయన పాల్గొన్నారు. ఆయన గ్రామంలోని ప్రధాన సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు పరిష్కరించుకోవాలంటే ప్రజలు, అధికారులు చుట్టూ తిరగాల్సిన పనిలేదని వారే రైతులు చుట్టూ తిరిగి సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు. బంధువులు, దాయాదుల మధ్య ఉన్న భూ సమస్యలను గ్రామంలోని పెద్దలు, నాయకులు కూర్చుని ఇరువురిని ఒప్పించి పరిష్కరించేలా చేయాలన్నారు. రెవెన్యూ సదస్సు ఏ రెవెన్యూ గ్రామంలో జరుగుతుందో ఆ రెవెన్యూకు సంబంధించిన పూర్తి సమాచారం. రికార్డులు సదస్సుకు తీసుకువచ్చి ఇక్కడే కూర్చుని మీ సమస్యలను పరిష్కరి స్తారని తెలిపారు. ఉపాధిహామీ పథకంలో పనులు గ్రామ సమీపంలో కాకుండా అడవిలో చేయిస్తున్నారని గ్రామస్తులు తెలపగా ఏపీవోఎక్కడ అని అడిగారు. ఆమె రాలేదని చెప్పడంతో కలెక్టర్ వస్తున్నారని తెలిసినా రాలేదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, తహసీల్దార్ జరీనా, ఎంపీడీవో శేషగిరిరావు, అన్ని శాఖల అధికారులు, జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, ధనంజయనాయుడు, మోహన్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

### రెవెన్యూ సదస్సులో భూ సమస్యలు పరిష్కారం : జెసి శుభం

బాలాయపల్లి, డిసెంబర్ 6, ప్రభాతవార్త : రెవెన్యూ సదస్సులో సత్వాలనే భూ సమస్యలు పరిష్కారం అవుతాయని జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సాల్ తెలిపారు. మండలంలోని వెంకటరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏపీ ప్రభుత్వం, సీఎం చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులో ముఖ్యఅతిదులుగా తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సాన్ లాల్, గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా పాల్గొన్నారు. సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే సీఎం నేరుగా గ్రామాల్లోనే ఇటువంటి సదస్సులు నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. భూ సమస్యలపై విరివిగా వినతులు జాయింట్ కలెక్టర్‌కు అందజేశారు. ఎంపీటీసీ మెంబెర్ సిద్దమ్మకు వన్ బి ఆన్లైన్ లో రావడం లేదని జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్తే, వెంటనే 1బి తీసి ఆమెకు అందజేశారు. గ్రామంలో కొంతమంది 20 సంవత్సరాల క్రితం ఇల్లు నిర్మించుకున్నామని అవి శిథిలావస్థకు చేరుకున్నాయని, నూతన గృహాలు కావాలని జెసి దృష్టికి తీసుకుని వచ్చారు.

జెసి, సబ్‌కలెక్టర్, తహసిల్దార్ పి.శ్రీనివాసులు, ఎంపిడిఓ డి.జె. వినీల్ కుమార్‌లు గ్రామంలోకి వెళ్లి ఇళ్లను పరిశీలించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టి తీసుకుని పరిష్కరిస్తామన్నారు. ఎక్కువగా మ్యుటేషన్, ప్రభుత్వ భూములకు పట్టాలు కావాలని, సాగు చేసుకుంటున్న భూములకు 1బి రావడం లేదని, పెన్షన్లు ఇంకా కొన్ని సమస్యలు రెవెన్యూ సదస్సుకు ప్రజలు తీసుకుని వచ్చారు. వినతులు అందజేశారు. ఈ రెవెన్యూ సదస్సులో ఆర్ ఐ శ్రీకాంత్, వీఆర్వోలు ఈశ్వర రాజు, ఎంపీడీవో డీజే వినీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాసరం ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెండ్

**17వ విడత సామాజిక తనిఖీ బహిరంగసభ -రూ.1.36లక్షలు నగదు రికవరీ**



పిల్లమేడుకు సంబందించిన వివరాలను వెల్లడిస్తున్న డిఆర్‌పిలు

తొట్టంబేడు, డిసెంబర్ 6 ప్రభాతవార్త : వలసలను నివారించేందుకు కేంద్రప్రభుత్వం ఎంతో మహోన్నత ఆశయంతో 'మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకం' ప్రవేశపెట్టిందని దీన్ని సక్రమంగా అమలు చేయాలని డ్వామా పిడి శ్రీనివాసప్రసాద్ అన్నారు. శుక్రవారం ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో 17వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సభను నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపిడిఓ సురేంద్రనాథ్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిధులుగా డ్వామా పిడి శ్రీనివాసప్రసాద్, ఏపిడి ప్రేమ్ కుమార్, స్టేట్ రీసోర్స్ పర్సన్ వెంకయ్య, జిల్లా విజిలెన్స్ అధికారి శివయ్య, వైకాపా సీనియర్ నాయకులు ఉన్నం వాసుదేవ నాయుడులు హజరయ్యారు. తొలుత డ్వామా పిడి శ్రీనివాసప్రసాద్ మాట్లాడు తూ వలసలను నివారించడానికి కేంద్రప్రభుత్వం ఈపథకాన్ని ప్రవేశపెట్టిందని తొట్టంబేడు మండలంలోని 27 పంచాయతీల్లో ఏఏ పనులు చేశారో సమగ్రంగా తెలుసుకున్నారు. గత నెల 9 నుంచి 20వ తేదీ వరకు గ్రామాల్లో 12మంది డిఆర్‌పిలు, 1 ఎస్ఆర్‌పిలు కలసి పరిశీలించి సమగ్ర నివేదికను ఓపెన్‌ఫోరంలో పిడికి తెలిపారు. ఈ ఏడాది మండల బడ్జెట్ రూ.7,12,84,262కోట్లు నిధులు విడుదల చేసిందని పనులను కల్పించాల్సిన బాధ్యత ఏపిఓ, మరియు టెక్నికల్ అసిస్టెంట్‌లదే అన్నారు. ఉపాధిహామీ కూలీలకు సౌకర్యాలు కల్పిస్తున్నారా? లేదా? వారికి కూలి నగదు ఎప్పుడెప్పుడు ఇస్తున్నారో తెలుసుకున్నారు. ఇక కాసరం పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ బాలసుబ్రమణ్యం మస్టర్‌లో సంతకాలు ఫోర్జరీ చేయడంతో పాటు తన కుటుంబసభ్యుల పేర్లు కూడా చేర్చి నగదు స్వాహా చేసిన కారణంగా తొలగిస్తున్నామని పిడి తెలిపారు. అనంతరం ఎపిఓ సుజాత మాట్లాడుతూ మండలంలో మొత్తం 8845 జాబ్‌కార్డులు ఉన్నాయని, 4670 కార్డులు యాక్టివ్‌లో ఉన్నాయన్నారు. పంటకాలువలకు ప్రాధాన్యత ఇస్తున్నామని పిడికి వివరించారు. కార్యక్రమంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధిహామీ సిబ్బంది గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

### డిపో మేనేజర్‌వైఖరిపై...

## రీజనల్ మేనేజర్ దృష్టి సారించాలి

గూడూరు, డిసెంబర్ 6 ప్రభాతవార్త : ఏ.పి.ఎస్.ఆర్టీసీ గూడూరు డిపో ఎదుట శుక్రవారం రోజు అక్రమ సస్పెన్స్‌లను రద్దు చేయాలని కోరుతూ నిరసన కార్యక్రమం నాయకులు కె.యస్.వాసులు ఆధ్వర్యంలో రెండో రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమానికి యస్.యస్.వి.కృష్ణ నాయకత్వం వహించడం జరిగింది. ముందుగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా జిల్లా కార్యదర్శి శివకుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం సీనియర్ నాయకులు పుట్టా శంకరయ్యలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా ఎస్.డబ్ల్యూ.ఎఫ్. కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ గూడూరు డిపో మేనేజరు వైఖరిపై రీజనల్ మేనేజర్ దృష్టి పెట్టాలని ఎస్.డబ్ల్యూ.ఎఫ్. సభ్యుల సస్పెన్షన్, వెనుక ఉన్న సస్పెన్స్ గుర్తించాలని, తద్వారా అక్రమ సస్పెన్స్‌లను రద్దుచేసి కార్మికులను విధులకు తక్షణం తీసు కోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిపో ఎస్.డబ్ల్యూ.ఎఫ్ సహాయ కార్యదర్శి కె.ఎస్.వాసులు మాట్లాడుతూ డి.ఎం.ఉద్దేశపూర్వకంగానే ఎస్. డబ్ల్యూ.ఎఫ్. సభ్యులను సస్పెండ్ చేశారని, ఇతర యూనియన్ సభ్యుల కేసులను 1/2019 సర్కులర్ ప్రకారం పరిష్కరించి, ఎస్.డబ్ల్యూ.ఎఫ్ సభ్యులకు వర్తింప చేయక పోవడం అన్యాయమన్నారు. సి.ఐ.టి.యు గూడూరు పట్టణ కార్యదర్శి యస్.సురేష్ మాట్లాడుతూ సి.ఐ.టి. యు. సంఘాల ద్వారా తీవ్ర ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని, డిపో మేనేజర్ వైఖరి డిపోలోని ప్రతి ఉద్యోగికి తెలుసునని, ప్రతి ఉద్యోగి అక్రమ సస్పెన్షన్ రద్దు కోసం జరిగే కార్యక్రమాలకు సహకరించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమానికి డిపో.ఎస్.డబ్ల్యూ. ఎఫ్. కమిటి సభ్యులు పి.కిరణ్, వై.యస్.రాజు, పి.రమణయ్య, ఎస్కె.బాషా, పి.రవీంద్రయ్య ఎం.ఎస్. వాసులు, ఎస్.కృష్ణయ్య ఏ.పెంచలయ్య, ఆర్.భాస్కర్, పి. రవీంద్ర, సుకుమార్, వి.అజంత, ఎస్.డి.జబీన్, సి.ఐ.టి.యు నాయకులు ప్నామజ మణి, గండికోట మధు, గుర్రం రమణయ్య, ఆడపాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

